క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

పూడూరు: ఈ నెల 28న పూడూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన సమీక్ష జరగనుందని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. సభ్యులు సకాలంలో సమావేశానికి రావాలని తెలిపారు.

బాలికలు క్రీడల్లో రాణించడం హర్షణీయం


బాలికను అభినందిస్తున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: బాలికలు క్రీడల్లో రాణిస్తుండటం హర్షణీయమని ఎస్‌ఐ శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధి విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన తేజశ్రీ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్–18 విభాగంలో నిర్వహించిన పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారిణిని, పీఎస్ ఆవరణలో ఎస్‌ఐ ఘనంగా సన్మానించి మాట్లాడారు. బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఇందులో రాజు, రాఘవేందర్, శ్రీనాథ్, చంద్రశేఖర్, పాండు, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీరోడ్ల పనులు ముమ్మరం


ధారూరు మదగడ్డ కాలనీలో కొనసాగుతున్న సీసీ నిర్మాణం పనులు

ధారూరు: గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరయిన నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ధారూరులోని శాలివాహన కాలనీ నుంచి శ్రీ వీరభద్రేశ్వరస్వామి దేవాలయం వరకు, మందగడ్డ ఎస్సీ కాలనీ, లక్ష్మీనగర్‌తండా, తిమ్మానగర్‌లో సీసీరోడ్లను నిర్మించారు. రెవెన్యూశాఖ అనుమతితో సగం డస్ట్, సగం ఇసుక మిశ్రమాన్ని రోడ్ల నిర్మాణంలో వినియోగించినట్లు సమాచారం.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి


క్రీడాకారులతో నాయకులు

పూడూరు: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు రాకంచర్ల పెంటయ్య అన్నారు. సోమవారం ఆయన అంగడిచిట్టంపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఆటలతోనే స్నేహబంధాలు బలపడతాయన్నారు. అనంతరం టోర్నీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటాపూర్ జట్టుకు రూ.20వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన అంగడిచిట్టంపల్లి టీంకు రూ.10 వేలు, తృతీయ స్థానంలో సరిపెట్టుకున్న షాద్‌నగర్ జట్టుకు రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, శేఖర్, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న మహిళలు

పూడూరు: మండల పరిధి తిర్మలాపూర్‌లో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్, తుల్జాభవానీ మాత ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, యజ్ఞాలు, పూజలు జరిపించారు. అనంతరం సేవాలాల్‌ను పల్లకీలో ఊరేగించారు. గ్రామస్తులు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని, చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యం సమర్పించారు. గిరిజనులు సంప్రదాయ దుస్తులతో నృత్యం చేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, మాజీ సర్పంచ్ కమ్లీబాయి, బంజారా నాయకులు కిషన్, రాముడు నాయక్, రవీందర్, బాలు, రాంజీ, మల్లేశ్, లక్ష్మణ్, పరశురాం పాల్గొన్నారు.

హరితలక్ష్యం బుగ్గిపాలు!


గొల్లగూడ, ఎల్లకొండ మధ్యలో రోడ్డు పక్కన కాలిపోయిన హరితహారం మొక్కలు

ఏటా నాటడం.. కాలిపోవడం
- మొక్కల సంరక్షణ మరచిన అధికారులు
- ఆహుతి అవుతున్నా పట్టించుకోని వైనం

> పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కల పెంపకానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా హరితహారం పేరుతో ఏటా రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాలు, అడవుల్లో సైతం సీడ్ బాల్స్ విసురుతూ వృక్ష సంపద పెంచుతోంది. కానీ కొందరి నిర్లక్ష్యం వలన మొక్కదశలోనే అవి బుగ్గిపాలై హరితలక్ష్యం నీరుగారిపోతోంది.

నవాబుపేట: ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారం కార్యక్రమం చివరకు నవ్వుల పాలవుతోంది. పర్యావరణ పరిరక్షణకు, ప్రభుత్వ లక్ష్యం మేరకు ఏటేటా మొక్కలు నాటుతున్నా.. వాటి పర్యవేక్షణ కరవై.. కనుమరుగవుతున్నాయి. అవెన్యూప్లాంటేషన్ పేరుతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో ఉపాధి కూలీలు మొక్కలు నాటుతున్నారు. కానీ వాటి పోషణ పట్టించుకునే వారు లేక, అవి మొగ్గలోనే వాడిపోవడమో, పశువులకు మేతగా మారడమే, లేక అగ్గికి ఆహుతి అవడమో జరుగుతోంది. మండల పరిధి అక్నాపూర్, అత్తాపూర్, చించల్‌పేట, చిట్టిగిద్ద, ఎత్‌రాజ్‌పల్లి, మాదిరెడ్డిపల్లి, గేట్‌వనంపల్లి, మాదారం, ముబారక్‌పూర్ తదితర గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా గతేడాది 9,099 వేల మొక్కలు నాటి, నిర్లక్ష్యంగా వదిలేశారు.

బాధ్యత మరచిన అధికారులు

హరితహారంలో కార్యక్రమంలో ఎంపిక స్థలాల్లో మొక్కలు నాటడమే తమ బాధ్యతని, వాటి సంరక్షణ తమకు అవసరం లేదన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారంటూ పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. నాటిన మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగించక పోవడంతో, అవి గడ్డిలో కలిసి పోతున్నాయి. వేసవికాలంలో ప్రమాదవశాత్తో, లేక ఎవరైనా కావాలని చీడును తగలబెట్టిన నేపథ్యంలో మొక్కలు సైతం కాలి బూడిదవుతున్నాయి. ఇలా నిత్యం జరుగుతున్నా.. సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకులు వాటి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రూ.లక్షలు, కోట్లు వెచ్చించి చేపడుతున్న హరితహారం.. కొందరి నిర్లక్ష్యం కారణంగా అపహాస్యంగా మారిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించి, పచ్చదన పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> అవెన్యూప్లాంటేషన్‌లో భాగంగా పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నాము. వేసవికాలం వచ్చిందంటే, రోడ్డు పక్కన ఉన్న భూముల్లో వాటి యజమానులు చీడును తగలబెడుతుంటారు. దీంతో ఆ మంటలు మొక్కలకు అంటుకొని కాలిపోతున్నాయి. ఇక నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – సుమిత్రమ్మ, ఎంపీడీఓ, నవాబుపేట


ఆలయం వద్ద ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న శివభక్తులు


సభకు 20వేల మందిని తరలిస్తాం

- మరో రెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభకు తాండూరు నియోజకవర్గం నుంచి 20 వేల మందిని తరలిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం బొంకూర్ గ్రామంలో శివాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు. మంగళవారం చేవెళ్లలో చేపట్టే బహిరంగ సభలో రూ.500 సిలిండర్‌తో పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు మంబాపూర్ నారాయణ రెడ్డి, కొమ్ము గోపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డిలు తదితరులు ఉన్నారు.

ముగిసిన ఆలయ మహోత్సవం

మండల పరిధి బిజ్వార్ అనుబంధ గ్రామం బొంకూర్‌లో శివాలయ పునర్నిర్మాణ మహోత్సవాలు ముగిశాయి. గ్రామంలోని పురాతన ఆలయాన్ని దాతల సహాయంతో ఇటీవల పునర్నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నందీ విగ్రహ ఆవిష్కరణ, కలశం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. శివాలయం వద్ద బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, రాములు, శ్రీను, శివభక్తులు తదితరులు పాల్గొన్నారు.


గర్భగుడిలో కొలువు దీరిన స్వామివారు

ఆదమరిస్తే అంతే సంగతి


చన్గోముల్ సమీపంలో సగానికిపైగా ధ్వంసమైన కల్వర్టు

పూడూరు: చన్గోముల్–లాల్‌పహాడ్ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా ఉండటమే కాకుండా.. పలు చోట్ల గుంతలు పడి, ప్రమాదకరంగా మారింది. పలుమార్లు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు, స్థానిక పాలకులు రోడ్డు దుస్థితిని పట్టించుకోలేదు. మండల పరిధి పోతిరెడ్డిగుడ నుంచి లాల్‌పహాడ్ వరకు కల్వర్టులు సగానికై పైగా ధ్వంసమయ్యాయి. వర్షాలు పడినప్పుడు మట్టి రోడ్లు కొట్టుకుపోయి, భారీ కయ్యలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదం బారిన పడక తప్పదని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోయినా, కనీసం సూచిక బోర్డులైనా అధికారులు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు తెలిపారు.

బస్సు రూటు మార్పు

చన్గోముల్, కంకల్ వాగుల వద్ద వంతెన నిర్మించారు. బ్రిడ్జికి ఇరు వైపులా బీటిరోడ్డు వేయకుండా, మట్టి పోసి వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షం పడితే రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. అంగడిచిట్టంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు బీటిరోడ్డును తవ్వి వదిలేశారు. మన్నేగుడ–చన్గోముల్ రోడ్డు పూర్తిగా దెబ్బతినగా.. ఆర్టీసీ అధికారులు బస్సు రూటు మళ్లించారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దాడిని ఖండిస్తున్నాం

దోమ: జర్నలిస్టు శంకర్‌పై దుండగులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బొంపల్లి మాజీ ఉప సర్పంచ్ రఫిక్ పాష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిగా సమాజ అభ్యున్నతికి పాటుపడుతున్న పాత్రికేయుడిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. శంకర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి

కుల్కచర్ల: ప్రజలతో స్నేహంగా ఉంటూ.. శాంతిభద్రతలను పర్యవేక్షించాలని పరిగి సీఐ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా మెలగడంతో పాటు, వారి సమస్యల గురించి వివరంగా తెలుసుకోవాలని చెప్పారు. పోలీసు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచి, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఇదులో ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అనాథను చేరదీసిన సంస్థ


వృద్ధుడికి క్షవరం చేయిస్తున్న ప్రవీణ్‌కుమార్

కొడంగల్ రూరల్: ఓ అనాథ వృద్ధుడిని అమ్మానాన్న ఫౌండేషన్ చేరదీసింది. సపర్యలు చేసి, మానవత్వం చాటుకుంది. ఆ సంస్థ సభ్యులు వృద్ధుడికి క్షవరం చేయించి, స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగించారు. దిక్కులేని వారి పట్ల చూపించే అభిమానం ఎంతో గొప్పదని, మానవ సేవే మాధవ సేవగా గుర్తిస్తూ.. ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు సంస్థ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేడు వృద్ధాశ్రమానికి భూమిపూజ

తాండూరు రూరల్: మండల పరిధి కరన్‌కోట్ గ్రామం సాగర్ సిమెంట్ రోడ్డు మార్గంలో వృద్ధాశ్రమానికి భూమిపూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి, కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ సమీపంలో ఉన్న మాల్‌రోజ ఆశ్రమ గురువు మల్లికార్జున అప్పాజి రానున్నట్లు వారు పేర్కొన్నారు.

బుగ్గలో ప్రత్యేక పూజలు

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక భజనలు చేపట్టి, ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.

కొత్త సొసైటీకి కల్లు వ్యాపారం

తాండూరు: పట్టణంలో కొనసాగుతున్న కల్లు వ్యాపారాన్ని కొత్త సొసైటీకి కట్టబెడుతూ ఎక్సైజ్ అధికారులు అనుమతులు జారీ చేశారు. దీంతో పట్టణంలోని సుమారు 50 దుకాణాలకు కల్లు సరఫరా మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా.. సొసైటీ మార్పు వెనక ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు సమాచారం.

పశువుల మేతకు పంటలు

- పశుగ్రాసం కోసం తుంపరసేద్యం

ధారూరు: వ్యవసాయ పనుల్లో కాడెడ్లకు బదులు యంత్రాల వినియోగం పెరగడంతో పశువులకు మేత కరువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి, వేరుశనగ, జొన్న, పెసర, కంది, మినుము తదితర పంటల కోత, సేకరణకు యంత్రాలను వాడుతున్నారు. దీని వలన గడ్డి, చొప్ప తదితర గ్రాసం పశువులు తినడానికి పనికి రాకుండా పోతోంది. దీంతో పశు సంపద ఉన్న రైతులు, వాటి మేత కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోలు చేద్దామన్నా సరైంది లభించకపోవడంతో.. గడ్డిని సాగుచేయాల్సి వస్తోంది. యాసంగి పంటల సేకరణ తర్వాత కొంతమంది అన్నదాతలు తమ పొలాలను తడిపి, గడ్డి విత్తనం వేసి, తుంపర సేద్యం చేయడం గమనార్హం.


స్ప్రింకర్ల ద్వారా గడ్డి సాగుకు నీటి తడులు

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు


మహిళల కోలాటాల మధ్య విగ్రహాలను తీసుకువస్తున్న వాహనం

కొడంగల్ రూరల్: పట్టణంలోని కార్గిల్ కాలనీ శ్రీ ధీర ఆంజనేయస్వామి నూతన ఆలయంలో ప్రతిష్ఠించేందుకు సోమవారం రాత్రి ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం, నవగ్రహాలను కాలనీకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆటపాటల మధ్య వాహనంలో విగ్రహాలను ఆలయానికి చేర్చారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

చేవెళ్ల: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మల్కాపూర్‌లో ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి చింపుల సత్యనారాయణరెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యాదయ్య, అశోక్‌గౌడ్, శంకరయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఉమర్, జంగయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, మహేందర్, వెంకటేశ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మర్పల్లి: మండల పరిధి కల్‌ఖోడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. రెండు దశాబ్దాల అనంతరం పాఠశాల వేదికగా.. అందరూ ఏకమై సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు రాంచెందర్, సురేశ్, సుధాకర్, జ్యోస్న, రాజశేఖర్ వేదం, విజయ్‌కుమార్, నిర్వాహకులు అనిత, ఇస్మాయిల్, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన లేక తండా వాసుల తిప్పలు


వాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)

బంట్వారం: వంతెన లేక తండా వాసులు తిప్పలు పడుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధి కంకణాలపల్లి నుంచి మల్‌శెట్టిపల్లి తండాకు వెళ్లే మార్గంలో వాగు ఉంది. ఇది వానాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో వాగును దాటడం మల్‌శెట్టిపల్లి వాసులకు కష్టతరమే. కానీ.. మరో మార్గం లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, గమ్యం చేరుకుంటున్నారు. ఈ క్రమంలో అనేకమంది వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడ్డారు. వంతెన నిర్మాణం కోసం చాలా కాలంగా అధికారులు, పాలకులకు విన్నవిస్తున్నప్పటికీ.. ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై సంబంధిత పీఆర్ డీఈ జితేందర్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు బ్రిడ్జి మంజూరు కాలేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తీర్మానం ప్రతిని ఇస్తే.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


జాజుగుబ్బడిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నేతలు

మర్పల్లి: గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. సోమవారం మండల పరిధి బూచన్‌పల్లి అనుబంధ గిరిజన జాజుగుబ్బడి తండాలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్.. సీసీరోడ్ల అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు వెచ్చించారని తెలిపారు. ఆ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహ్మారెడ్డి, టోప్యానాయక్, గ్రామ కమిటీ యూత్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, మాణిక్‌రెడ్డి, బక్కారెడ్డి, షెట్టి తదితరులు ఉన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం


క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు బి.సరస్వతి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుస్తకంలోని అంశాలతో పాటుగా సమాజంలో చోటుచేసుకుంటున్న సంఘటనలు, చారిత్రాత్మక అంశాల వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపధ్యాయులకు సూచించారు. మీరు కూడా అలాంటి అంశాలను తెలుసుకునేందుకు యత్నించాలని విద్యార్థులను ఉద్దేశిస్తూ ఆమె చెప్పారు. ఇందులో సీఆర్పీ విజయ్‌కుమార్, రాజు, హన్మంతు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా..


పాదయాత్రగా వెళ్తున్న శివభక్తులు

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధి పాతకొడంగల్ గ్రామానికి చెందిన పలువురు శివభక్తులు సోమవారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్లారు. అంతకు ముందు గ్రామంలోని శివాలయంలో శివలింగానికి పంచామృతాభిషేకం, అలంకరణ, శివాష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మంగళహారతులు పట్టి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో శివభక్తులకు ఇరుముడి కట్టి ఆశీర్వదించారు.

కానరాని పిచ్చుకలు.. పెరిగిన పావురాలు


పొలంలోని విద్యుత్ స్తంభం తీగలపై వాలిన పావురాల గుంపు

ధారూరు: నాడు ఎక్కడ చూసినా పిచ్చుకలు వేల సంఖ్యలో కనిపించేవి. సూర్యోదయం వేళలో విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలపై గుంపులుగా దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఎక్కడో ఓ చోట ఒకటిరెండు, అవికూడా అరుదుగా కనిపిస్తున్నాయి. పెరుగుతున్న సెల్‌ఫోన్ టవర్స్, తద్వారా వెలువడుతున్న రేడియేషన్ ప్రభావం పిచ్చుకల సంతతిపై పడింది. దాని ఫలితంగా పిచ్చుకలు క్రమంగా.. కనుమరుగవుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పిచ్చుకలు కానరాని లోటు పావురాలు తీరుస్తున్నాయి. ఎక్కడ చూసినా వందల సంఖ్యలో కనిపిస్తూ.. కనివిందు చేస్తున్నాయి. తాజాగా సోమవారం ధారూరు మండల పరిధి గట్టెపల్లి గ్రామంలోని వ్యవసాయ పొలంలోని విద్యుత్ స్తంభం తీగలపై పక్షుల గుంపు కనిపించింది.